# నీట్ పరీక్షను రద్దు చేయాలి

### అవకతవకలపై నేడు మోదీ దిష్టిబొమ్మ దహనం

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి,యువజన సంఘాల నేతలు

హిమాయత్‌నగర్,జూన్25: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు నష్టపోతున్న దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం,నిర్లక్ష్య వైఖరిని అవలంభించడాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా మోదీ దిష్టి బొమ్మల దహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యార్థి,యువజన సంఘాల నేతలు తెలిపారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం హిమాయత్‌నగర్ లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర,రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అభిజిత్ యాదవ్,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌రెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి శ్రీను, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్,వైజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె.సలీంపాషా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది ప్రతిభ కలిగిన విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు,అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలన్నారు.నీట్ డైరెక్టర్‌ను తొలగించడం కాదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని సమూలంగా రద్దు చేసి నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించి తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. నేతలు శ్రీకర్, లెనిన్, గౌత మ్,వీరన్న,మాజీద్అలీఖాన్,కల్యాణ్,జావిద్,హమ్మీబాబు,కృష్ణ పాల్గొన్నారు.

## ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ప రీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్ సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## బీకాం సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన రీ – అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

## మాల్స్‌లో తనిఖీలు

కేపీహెచ్‌బీ కాలనీ: జన సమ్మర్ధ ప్రాంతాల్లో భద్రతా చర్యల్లో భాగంగా కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని పలు వాణిజ్య మాల్స్‌లో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో పోలీసు సిబ్బంది, బీడీ బృందంతో నెక్సెస్ మాల్, లుల్లూ మాల్‌లలో తనిఖీలు చేపట్టారు. మాల్స్‌కు పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నందున భద్రతా అంశాలపై మా ల్స్‌కు చెందిన భద్రతా సిబ్బంది మరింత అవగాహన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

## అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

సురేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న అధ్యాపకులు

హిమాయత్‌నగర్,జూన్ 25: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విధులు నిర్వహించే అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నారాయణగూడలోని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో కడారు సురేందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సత్యనారా యణరెడ్డి, నాయకులు డాక్టర్ బెల్లి యాదయ్య, రమేశ్‌గౌడ్, డాక్టర్ పావని, మహేశ్, డాక్టర్ రాజారాం పాల్గొన్నారు.

### నిధులు కేటాయించాలి

మారేడ్‌పల్లి, జూన్ 25 : కంటోన్మెంట్‌కు అధిక నిధులు కేటాయించాలని కోరుతూ.. మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోనాల నేపథ్యంలో బస్తీలు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు, కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు.

## బాధ్యతాయుతంగా పని చేయాలి

పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ, కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి

మణికొండ, జూన్ 25: పారిశుధ్య పనులు బాధ్యతాయుతంగా నిర్వహించినప్పుడే ప్రజలకు ఇబ్బందులు రావని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మంగళవారం వట్టినాగులపల్లిలో కమిషనర్ ప్రవీణ్‌రెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. పారిశుధ్యం, డెవలప్‌మెంట్ పనులు తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు ప్రధాన రహదారులు, బస్తీలు, కాలనీలలోని రోడ్లను శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. రహదారులపై చెత్తాచెదారాలు పేరుకుపోకుండా వారి ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తారన్నారు. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్క్, గ్లౌజ్, షూ తదితర వాటిని ధరించి తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలన్నారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా

సాయిబాబానగర్ కాలనీలో పర్యటించి మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 25: మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయిబాబానగర్, వడ్డెర బస్తీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ మేరకు స్థానికులు భూగర్భ డ్రైనేజీ పైపులైన్, తాగునీరు తదితర సమస్యలపై దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారాలకు చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులపై సమీక్షించి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతుగౌడ్, మధుసూదన్‌రెడ్డి, మధు, ఎన్ను శంకర్, రమేశ్‌రెడ్డి, గోపాల్‌నాయక్, తలారి చిన్న, పాండు యాదవ్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి డీజీఎం ఖాదర్, సూపర్‌వైజర్ లోక్‌నాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుస్తకాలు, యూనిఫాంల విక్రయంపై ఆందోళన

పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

శంషాబాద్ రూరల్, జూన్ 25 : ప్రైవేటు పాఠశాలలో పాఠ్యపుస్తకాలను, యూనిఫాంల విక్రయాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కోరారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని యూరో కిడ్స్ పాఠశాలలో యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను విక్రయిస్తుండగా ఇదేమిటని ప్రశ్నిస్తే తమ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నట్లు వారు వివరించారు. దీంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగినట్లు తెలిపారు. ఎంఈవో కార్యాలయం నుంచి ఓ అధికారి వచ్చి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు , యూనిఫామ్‌లు అమ్ముకుండా అరికడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిపారు. నాయకులు కౌశిక్, తరుణ్, శ్రీకాంత్, అర్జున్, ప్రసాద్,వంశీ, సాయి పాల్గొన్నారు.

### సీసీరోడ్డు పనులు పరిశీలన

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 25 : సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని బాలాజీనగర్ మాజీ కార్పొరేటర్ బాబూరావు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని టీ అంజయ్య నగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. బాబూరావు మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని, అందుబాటులోకి తేవాలని కోరారు.

## బోనాలకు గుర్తింపు తెచ్చింది బీఆర్ఎస్సే

బేగంపేట్ జూన్ 25: ఆషాఢ బోనాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలను రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వం అధ్వర్యంలో నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాలు అని తేడా లేకుండా అన్ని దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. ఈ సంవత్సరం బోనాల నిర్వహణకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు రెండు రోజుల్లోగా దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

## చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

జూబ్లీహిల్స్,జూన్25: భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని.. నేటితరం యువత ఈ తరహా వస్త్రాలను ఆదరించడం అభినందనీయమని టాలీవుడ్ వర్ధమాన నటి తాక్షి చిత్గోపాకర్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నంబర్–12 లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటుచేసిన హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను నిర్వాహకులు జయేశ్ గుప్తతో కలిసి ప్రారంభించారు. ఈ నెల 30 వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్, హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల కలెక్షన్స్ అందుబాటులో ఉంచారని నిర్వాహకులు గుప్త తెలిపారు.

## అనాథ విద్యార్థులకు రూ.60వేల విరాళం

అనాథ విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న రాజేశ్, తదితరులు

ఆర్కేపురం, జూన్ 25: ఆర్కేపురం డివిజన్ ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీకి చెందిన ఎస్.రాజేశ్ సతీమణి సృజన పుట్టిన రోజు సందర్భంగా ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ.60వేల చెక్కును గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. సమాజంలోని అనాథ విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని సూచించారు.

### పేద విద్యార్థులనుఆదుకోవాలి

కందుకూరు, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంపీటీసీ రేఖాబాబు రావు తెలిపారు. మండల పరధిలోని గుమ్మడవెల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బండారు అలివేల ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. ఏఏపీసీ చైర్మన్ శోభ తదితరులు పాల్గొన్నారు.

### సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక

హిమాయత్‌నగర్, జూన్25: హైదరాబాద్ ఇంటెలిజెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పగడాల శ్రీశైలం ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు.గతంలో ఈస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ విభాగంలో పనిచేసిన సందర్భంలో జరిగిన ఓ హత్య కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కనబరిచిన ప్రతిభను గుర్తించి పోలీస్ ఉన్నతాధికారులు 2000లో హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ కల్పించారు. నగరంలో స్పెషల్ బ్రాం చ్,టాస్క్‌ఫోర్స్ విభాగాలలో పనిచేసిన సమయంలో పలు క్యాష్ రివార్డులు ప్రశంసా పత్రాలు అందుకోగా, సర్వీసులో ఇతను ఇప్పటివరకు సుమారు 380 రివార్డులను పొం దారు.ఈ సేవా పురస్కారానికి ఎంపిక కావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పోలీస్ ఉన్నతాధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యార్థికి చేయూత

మాదాపూర్, జూన్ 25: విద్యార్థి విద్య నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ చేయూతనందించింది. ఈ నేపథ్యంలో మంగళవారం హుడా కాలనీలోని హోప్ కార్యాలయంలో విద్యార్థి అశ్రా సిద్ధితో కలిసి తండ్రి అమర్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండా విజయ్‌కుమార్ చేతులమీదుగా రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డురాకూడదనే ఆలోచనతో తమ క్లబ్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి అశ్రా సిద్ధి తారానగర్ విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కూకట్‌పల్లి దయార్‌గూడ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ చైతన్య తెలిపారు.

## పైప్‌లైన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

పైప్‌లైన్ బస్తీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్,జూన్25: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం పైప్‌లైన్ బస్తీలో పర్యటించి బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తాగునీటికి సంబంధించిన పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణగూడ జలమండలి డీజీఎం సన్యాసిరావు, మేనేజర్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రామన్ గౌడ్, మహేశ్, శేఖర్ పాల్గొన్నారు.

## మహిళల సమస్యలు పరిష్కరిస్తా

నార్సింగ్ మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణను సన్మానిస్తున్న మహిళలు

మణికొండ, జూన్ 25: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ తెలిపారు. నూతనంగా చైరపర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగపూర్ణను ఆర్‌పీలు, డ్వాక్రా గ్రూప్ మహిళలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూప్ భవనం నిర్మించాలని చైర్ పర్సన్‌ను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం మెరుగుపడుతుందన్నారు. మహిళల కోసం డ్వాక్రా భవన నిర్మాణం చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి

జూబ్లీహిల్స్, జూన్25 : క్షేమంగా గమ్యానికి చేర్చే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండంటూ మంగళవారం ఆర్టీసీ కళాకారులు నగరంలోని జేబీఎస్ బస్‌స్టాండ్‌లో కళారూపాలు ప్రదర్శించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. సుఖవంతం అంటూ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

### బోనాలకు ఏర్పాట్లు

ఆర్కేపురం, జూన్ 25: త్వరలో ఆషాఢ మాసం సందర్భంగా ఖిల్లా మైసమ్మ దేవాలయంలో నిర్వహించనున్న బోనాల జాతర సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సరూర్‌నగర్ తాసీల్దార్ వేణుగోపాల్ ఖిల్లా మైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయ ధర్మదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్‌తో చర్చించారు. బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామని ఆలయ అధికారులు చెప్పారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్, దేవాలయ కార్యనిర్వాహధికారి మురళీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### బస్సు పాసుల జారీకి 43 కేంద్రాలు

సిటీబ్యూరో, జూన్25(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో 43 బస్సు పాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు, జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం కొత్తగా జేఎన్‌టీయూ బస్టాపులో బస్సు పాస్ కౌంటర్ తెరిచామని చెప్పారు. ఈ కేంద్రాలు ఉదయం 6:30నుంచి రాత్రి 8:15 గంటల వరకు సేవలందిస్తాయన్నారు. గ్రీన్ మంత్లీ ఏసీ బస్సు పాస్‌లు కూడా జారీ చేస్తున్నట్టు వివరించారు. కాగా డిమాండ్ దృష్ట్యా మొబైల్ వెహికిల్ బస్సు పాస్ సేవలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కందుకూరు, జూన్ 25 : గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కందుకూరు గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలు కలిసికట్టుగా ఉంటూ.. అభివృద్ధి కోసం కృషి చేయాలని చెప్పారు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని అందుకోసం అధికారులకు సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించాలని కోరారు. గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి ఎంపీడీఓ సరిత, ఎంపీఆర్ఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## 'బొల్లిమచ్చలు అంటువ్యాధి కాదు'

### గాంధీ దవాఖాన డి.వి.ఎల్. విభాగం హెచ్ఓడీ డాక్టర్ సి.సుధారాణి

' ప్రపంచ విటిలిగో డే ' సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన డి.వి.ఎల్. వైద్యులు

బన్సీలాల్‌పేట్, జూన్ 25 : బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదని, సాధారణ చర్మవ్యాధి అని గుర్తించాలని గాంధీ దవాఖాన చర్మ, లైంగిక, లెప్రసీ (డి.వి.ఎల్.) విభాగం హెచ్ ఓడీ డాక్టర్ సి.సుధారాణి అన్నారు. ' ప్రపంచ విటిలిగో డే ' సందర్భంగా ఏఐడీపీఎల్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డి.వి.ఎల్. విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తెల్లమచ్చలు రావడానికి మెలనోసైట్ రసాయనం ఉత్పత్తి కాకపోవడమే కారణమన్నారు. దాని వలన చర్మం సహజరంగు కోల్పోతుందని, తెల్లని మచ్చలు ఏర్పడతాయని తెలిపారు. అన్ని తెల్లమచ్చలు బొల్లి కాదని తెలుసుకోవాలన్నారు. డి.వి.ఎల్. విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘుకిరణ్ మాట్లాడుతూ.. ఇక్కడ ఫొటోథెరపీ, టాపికల్, సిస్టమిక్ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి శుక్రవారం ఇక్కడ విటిలిగో క్లినిక్‌కు రావొచ్చని, అనుభజ్ఞులైన వైద్యులు ఆరోగ్య సలహాలు, చికిత్స, మందులు ఉచితంగా ఇస్తారని ఆయన అన్నారు. మెలనిన్ ఉత్పత్తి పెంచే మందులు, స్టెరాయిడ్స్ క్రీములు, యు.వి.బి. థెరపీ ద్వారా విటిలిగో వ్యాధికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శంకర్, డాక్టర్ సత్తయ్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ శాంభవి పాల్గొన్నారు.